సాక్షి తిరుపతి

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



మాపై ఎందుకీ నిర్దయ

అయ్యా మాపై కాస్త దయ చూపి సమస్యలు పరిష్కరించండంటూ పలువురు కలెక్టరేట్ అధికారులను వేడుకున్నారు - 8లో



"ఫిట్‌నెస్ ఐజర్"

విద్యార్థుల చదువులతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ఐజర్‌లో ఇండోర్ స్టేడియం, జిమ్ ఏర్పాటు చేశారు. - 8లో



3వ కేటగిరీకి మార్చండి

వాటర్‌ప్లాంట్ల విద్యుత్ మీటర్లను కేటగిరీ 3గా మార్చాలని వాటర్‌ప్లాంట్ అసోసియేషన్ నేతలు విద్యుత్‌శాఖ సీఎండీని కోరారు. - 8లో

న్యూస్‌రీల్

మాటల్లోనే పారదర్శకత.. సిఫార్సులకే ప్రాధాన్యత



మల్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

చిట్టమూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నాలుగు నెలలక్రితం ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టింది. ఈ ప్రక్రియలో ఎక్కడా అవకతవకలకు చోటు లేకుండా పారదర్శకంగా చేపట్టామని అసెంబ్లీ సాక్షిగా విద్యాశాఖ మంత్రి చెప్పిన మాటలు క్షేత్రస్థాయిలో వచ్చేసరికి నీటి మూటలుగా మారాయి. ఉపాధ్యాయులు ఒక పాఠశాలలో పని చేసేందుకు బదిలీపై వస్తే కనీసం రెండేళ్ల పాటు అక్కడే పని చేయాలన్న నిబంధన (జీఓ) ఉంది. ఈ క్రమంలోనే నాలుగు నెలల క్రితం బదిలీల్లో భాగంగా నెల్లూరు నుంచి చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తే హెచ్‌ఆర్‌ఏ తక్కువగా వస్తుందని గతంలో పని చేసిన ప్రాంతంలో హెచ్‌ఆర్‌ఏ ఎక్కువగా వస్తుందనే కారణంతో భారీ స్థాయిలో ముడుపులు చెల్లించుకుని సీఎంఓ కార్యాలయం నుంచే సిఫారసు చేయించుకుని సదరు ఉపాధ్యాయిని మళ్లీ తాను పని చేస్తున్న నెల్లూరుకు బదిలీ చేయించుకున్నారు. ఇదే కోవలో మరి కొంతమంది బదిలీలు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో ఉపాధ్యాయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీల ప్రక్రియను చేపడుతుండడంపై పలువురు ఉపాధ్యాయులు ఇదెక్కడి పారదర్శకత అని ప్రశ్నిస్తున్నారు.

సీపీఓగా రాజశేఖర్



కలెక్టర్‌ను కలిసిన సీపీఓ రాజశేఖర్

తిరుపతి అర్బన్: చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్(సీపీఓ)గా రాజశేఖర్ సోమవారం కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి తిరుపతి జిల్లాకు బదిలీపై విచ్చేశారు. సీపీఓ ప్రేమ్‌చంద్రారెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం అసిస్టెంట్ సీపీఓగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ఆరు నెలలుగా ఇన్‌చార్జ్ సీపీఓగా పనిచేశారు. తాజాగా సీపీఓ పోస్టును భర్తీ చేశారు. బాధ్యత లు స్వీకరించిన అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు.

వస్తువుల విక్రయాలకు టెండర్ల ఆహ్వానం

తిరుపతి అర్బన్: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో వినియోగంలో లేని వస్తువులను విక్రయించడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం ఆ విభాగానికి చెందిన జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులను అందించడానికి అవకాశం ఉందని స్పష్టం చేశారు. దరఖాస్తులను తమ కార్యాలయంలోనే ఇస్తామన్నారు. అనంతరం అదేరోజు సాయంత్రం 4 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్లు తెరుస్తామన్నారు.

మేత భూమిలో గద్దలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఎక్కడ విలువైన ప్రభుత్వ భూమి కనిపించినా గద్దల్లా కూటమి నేతలు వాలిపోతున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో పేదలు కట్టుకున్న సుమారు 1250 ఇళ్లను ముఖ్యనేత ఆదేశాలతో అధికారులు నేలమట్టం చేశారు. అదే కూటమి నాయకులు రేణిగుంటలో జాతీయ రహదారి పక్కన రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే పట్టించుకోరు. సాక్షిలో కథనాలు రావడంతో ఉలిక్కిపడిన అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

రేణిగుంట- పాపానాయుడుపేట రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలు



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆక్రమణల పర్వం

- ముఖ్యనేత అండతో దర్జాగా ప్రభుత్వ భూమి ఆక్రమణ
- రేణిగుంట–పాపానాయుడుపేట రహదారి పక్కన అక్రమ కట్టడాలు
- ప్లాట్లు వేసి విక్రయించేందుకు సిద్ధమైన కూటమి నేతలు
- భూఆక్రమణలపై ఫిర్యాదు చేసిన వారికి పథకాలు రానివ్వమని బెదిరింపులు
- సాక్షిలో కథనాలు రావడంతో ఉలిక్కిపడిన రెవెన్యూ అధికారులు
- రాత్రికి రాత్రే హెచ్చరిక బోర్డు ఏర్పాటు

రేణిగుంట: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి నేతల ఆగడాలకు అంతులేకుండా పోయింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే ఆక్రమించేసి.. అక్రమ కట్టడాలు చేపట్టడం.. ఆపై ప్లాట్లు వేసి విక్రయించేందుకు సిద్ధమవడం. ఇవన్నీ అధికారులకు తెలిసినా.. ముఖ్యనేత, ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఆదేశాలతో కిమ్మనకుండా ఉండడం షరా మామూలైంది. తాజాగా రేణిగుంట మండలంలోని జీపాల్యం రెవెన్యూ గ్రామంలోని లెక్క దాఖలాలో సర్వే నంబర్ 212లో ప్రభుత్వ పశువుల మేత బీడు భూమి ఉంది. ఈ భూమి రేణిగుంట – పాపానాయుడుపేట ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో కూటమి నేతల కన్ను పడింది. గత నెలలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని కొందరు కూటమి నాయకులు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో ప్లాట్‌ను రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు బేరం పెట్టి విక్రయించడానికి సిద్ధమయ్యారు.

కోర్టు ఆర్డర్లను సాకుగా చూపి..





రాత్రివేళ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తమకు కోర్టు ఆర్డర్లు ఉన్నాయని చెబుతూ ఆక్రమణదారులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు సైతం వారికి కోర్టు ఆర్డర్లు ఉన్నాయని తాము వెళ్తే కోర్టు ఉల్లంఘన కింద తమపై చర్యలు తీసుకుంటారని దాటవేత ధోరణి ప్రదర్శించారు. అయితే సోమవారం సాక్షి ప్రతినిధులు ఆక్రమణ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించడంతో రెవెన్యూ అధికారులు ఉలిక్కిపడి రాత్రి సమయంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో పేదలు నిర్మించుకున్న ఇళ్లకు కోర్టు ఆదేశాలు ఉన్నా కూడా కూల్చేందుకు సిద్ధమవుతున్న రెవెన్యూ అధికారులు ప్రస్తుతం ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నియోజకవర్గ ముఖ్య నేత పీఏతో ఒప్పందం కుదుర్చుకుని రెవెన్యూ అధికారులు, స్థానికులు ఎవరూ అడ్డు చెప్పకుండా ఉండేవిధంగా స్థానిక కూటమి నాయకులు అంతా తామై చూసుకున్నారు. కానీ అక్రమ నిర్మాణాలపై సాక్షిలో వచ్చిన వరుస కథనాలకు రెవెన్యూ అధికారుల్లో చలనం వచ్చింది. అక్రమ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. కానీ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడానికి అధికారులు ధైర్యం చేయలేకపోయారు.

ఫిర్యాదు చేస్తే పథకాలు రావు..

ప్రభుత్వ భూమిలో చేపడుతున్న ఆక్రమణలపై గత సోమవారం కృష్ణయ్య కాలువకు చెందిన ప్రజలు గ్రీవెన్స్ డేలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారిని సైతం స్థానిక కూటమి నాయకులు భయభ్రాంతులకు గురి చేసి, ఫిర్యాదు వెనక్కి తీసుకోకపోతే, ప్రభుత్వ పథకాలు రానీయమని బెదిరించారు. గ్రామం పక్కన కళ్లెదుట జరిగే అక్రమాలను ప్రశ్నిస్తే ఇలా ప్రభుత్వ పథకాలు ఆపేస్తామని బెదిరించడం ఏమిటని స్థానికులు వాపోయారు. జిల్లా అధికారులైనా స్పందించి ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవాలని ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 83,412మంది స్వామివారిని దర్శించుకున్నారు. 33,058 మంది భక్తులు తలనీలాలు అర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

రేపటి నుంచి పశు వైద్య కళాశాలలో జాతీయ సదస్సు

- ఎస్వీ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ జగపతి రామయ్య



మాట్లాడుతున్న జగపతి రామయ్య

చంద్రగిరి: తిరుపతిలోని ఎస్వీ పశు వైద్య విశ్వవిద్యాలయంలో ఈనెల 8, 9వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య తెలిపారు. ఎస్వీ పశు వైద్యకళాశాలలోని పశువైద్య చికిత్స, బోధన విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 250 మంది పశువైద్య విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పశువుల్లో వచ్చే వ్యాధుల నిర్ధారణ, చికిత్స, నివారణ, శస్త్ర చికిత్సలు, గర్భకోశ వ్యాధులపై శాస్త్రీయపరమైన చర్చలు నిర్వహిస్తారన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తమిళనాడు పశువైద్య విశ్వవిద్యాలయం రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ ఎస్.తిలగర్ హాజరవుతారని చెప్పారు.

నేడు నారావారిపల్లికి సీఎం చంద్రబాబు



ఏ.రంగంపేట వద్ద హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



సీఎం పర్యటన ఏర్పాట్లపై ఎస్పీ, ఇతర అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి
- కలెక్టర్ వెంకటేశ్వర్

చంద్రగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం స్వగ్రామం నారావారిపల్లికి రానున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌తో కలిసి ముందస్తు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఉదయం 11.10 గంటలకు ఏ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని, అనంతరం అక్కడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి నారావారిపల్లి చేరుకుంటారన్నారు. అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొని, అనంతరం తిరిగి 1.40 గంటలకు ఏ.రంగంపేట వద్ద ఉన్న హెలిప్యాడ్ చేరుకుని విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రదేశాలలో భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి స్పెషలిస్ట్ డాక్టర్లు ఏర్పాటు, సేఫ్ రూమ్ ఏర్పాటు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, ఫైర్ సేఫ్టీ, హెలిప్యాడ్ వద్ద బారికేడ్ల ఏర్పాటు, నిరంతర విద్యుత్ తదితర ఏర్పాట్లపై విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్‌కు ఉత్తమ అవార్డు



జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ

వెంకటగిరి రూరల్: వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్‌కు స్వచ్ఛాంధ్ర ఎస్ఏఎస్ఏ ఉత్తమ బస్టాండ్ అవార్డు వరించింది. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బస్టాండ్, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం పట్ల అవార్డు దక్కినట్లు డిపో మేనేజర్ రామకృష్ణ తెలియజేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా స్థానిక ఆర్టీసీ డీఎం రామకృష్ణ పురస్కారం అందుకున్నారు.

కౌలు రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : దేవదాయ శాఖ అధికారులు నిబంధనలకు వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం వాకాడుకు చెందిన పలువురు కౌలు రైతులు ఆయనను కలిసి వాకాడు నాగేశ్వరస్వామి, అలఘునాథస్వామి, కోదండరామస్వామి ఆలయ భూముల కౌలు వేలాన్ని అధికారులు ఇష్టానుసారం నిర్వహిస్తున్నారని మొర పెట్టుకున్నారు. ఈ విషయమై రామ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు. ఆలయ భూముల కౌలు వేలం నిర్వహించే తీరు అధికారులకు తెలియకపోతే నెల్లూరుకు చెందిన ఆ శాఖ మంత్రిని అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. మూడు ఆలయాలకు సంబంధించి 96 ఎకరాలు ఉండగా అందులో కేవలం 25 ఎకరాలకు మాత్రమే కౌలు వేలంపాట నిర్వహించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మండలంలోని పంట్రంగం గ్రామంలో వెలసిన శ్రీ పాండురంగేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి రూ.17 లక్షలు గోల్‌మాల్ జరిగితే వారిపై కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందో చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కౌలురైతులు, పాల్గొన్నారు.

మహిళల పాట్లు.. మగవారి ఫీట్లు

- తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల కష్టాలు
- బస్సుల కోసం గంటల కొద్దీ పడిగాపులు

తిరుపతి అర్బన్ : ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి ప్రతి రోజు 1.50 లక్షల నుంచి 1.60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్లుగా సర్వీసులను ఏర్పాటు చేయడం లేదని పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో స్త్రీశక్తి పథకాన్ని ఆగస్టు 15న ప్రారంభించిన తర్వాత పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. కొన్ని మార్గాల్లో ఉదయం ఒకటి, మధ్యాహ్నం ఒకటి, రాత్రి వేళ ఒకటి.. అంటే మూడే సర్వీసులను ఏర్పాటు చేశారు. సోమవారం తిరుపతి బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికులు పడిన తిప్పలు అన్నీఇన్నీ కాదు. బస్సు ఆగిన వెంటనే సీట్ల కోసం ప్రయాణికులు ఫీట్లు చేశారు. బస్సు కిటికీల్లో నుంచి దూరేస్తున్నారు. కొందరు కిటికీల్లో నుంచి లగేజీలు పెట్టేస్తున్నారు. ఆ తర్వాత బస్సెక్కి సీట్ల కోసం ఒకరిపై ఒకరు దాడులకు దిగుతున్నారు. డ్రైవర్ డోర్ నుంచి కొందరు ప్రయాణికులు సీట్ల కోసం లోపలకు దూరుతున్నారు. అయితే బస్సుల కొరత తీవ్రంగా ఉందని తాము చేసేదేమీ లేదని ఆర్టీసీ అధికారులు చేతులెత్తేస్తున్నారు.



భద్రం అక్క..తిరుపతి బస్టాండ్‌లో పల్లెవెలుగు బస్సు ఎక్కేందుకు తోసుకుంటున్న మహిళలు



సీటు కోసం ఈ మాత్రం ఫీట్లు చేయాల్సిందే..!



ఎంతమందైనా ఉండనీ.. బస్సెక్కేందుకు ప్రయాణికుల పాట్లు



ప్రభుత్వ నిర్లక్ష్యానికి సాక్ష్యం..బస్సు కోసం ప్రయాణికుల పడిగాపులు

అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

తిరుపతి సిటీ: ఎస్వీ యూనిర్సిటీలో గతేడాది నిర్వహించిన పలు పీజీ కోర్సులకు సంబంధించి 3, 4 సెమిస్టర్ల ఫలితాలు ఇప్పటి వరకు విడుదల కాలేదు. దీంతో ఎస్వీయూ పరిధిలో పీజీ పూర్తి చేసిన విద్యారులు పీహెచ్‌డీ ప్రవేశాలకు జరిగే ఏపీ ఆర్‌సెట్ పరీక్షకు అనర్హులుగా మిగిలిపోనున్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆర్‌సెట్ నోటిఫికేషన్ (పీహెచ్‌డీ ప్రవేశాలకు) సోమవారం విడుదలైంది. పీజీ ఫలితాల ఆలస్యం వెనుక కారణమేమని అధికారులను ఆరా తీయగా.. ఎగ్జామినేషన్ సెక్షన్‌లో, పరీక్ష పేపర్‌లో వాల్యుయేషన్ చేసే ప్రొఫెసర్లు సరిగా పనిచేయడం లేదని చెబుతున్నారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులే తమ కిందిస్థాయి ఉద్యోగులు పనిచేయడం లేదని చెబుతుండడంతో ప్రస్తుతం పీజీ చేస్తున్న, పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నేటి నుంచి ఆర్‌సెట్ దరఖాస్తుల ఆహ్వానం

పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో జరగనున్న ఏపీఆర్‌సెట్ 2024–25 నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో పీహెచ్‌డీ ప్రవేశాలకు మంగళవారం నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కానీ ఎస్వీయూ పరిధిలో సుమారు 2 వేల మంది ఈ ప్రవేశాలకు దూరం కానున్నారు.

12న కురబ సంఘం వార్షికోత్సవ సభ



వార్షికోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కురబ సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: విజయవాడలో ఈనెల 12వ తేదీన జరిగే ఏపీ కురుబ, కురుమ, కురువ సంఘం 10వ వార్షికోత్సవ సభకు రాష్ట్రంలోని కుల సంఘ నేతలు, కురబ కులబాంధవులంతా పాల్గొనాలని ఏపీ కురబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సంఘ నేతలతో కలిసి సంఘ వార్షికోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో కురబ భవనానికి అవసరమైన స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఈనెల 12న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సంఘ సభ జరుగుతుందని, అనంతరం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సౌత్ ఇండియా ఓబీసీ సదస్సు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దేశంలోని బీసీలు, అన్ని రాష్ట్రాల బీసీ ప్రతినిధులు, దక్షిణ, ఉత్తర భారతదేశం రాష్ట్రాల నుంచి ప్రముఖులు హాజరవుతారన్నారు.

క్లుప్తంగా

మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం


ఘాట్ రోడ్‌లో పిట్టగోడను ఢీకొన్న జీపు, స్వల్ప గాయాలైన భక్తులు

తిరుపతి క్రైమ్: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని 24 మలుపు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. తిరుమల ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుమల నుంచి తిరుపతికి ప్రయాణికులతో వెళ్తున్న ఓ లోకల్ జీపు బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి 24 మలుపు వద్ద పిట్టగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అనంతరం జీపును పక్కకు తొలగించి టీటీడీ సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం దుంగలను తరలించడానికి ప్రయత్నించిన కేసులో నారాయణవనం మండలం, ఎరికంబట్టుకు చెందిన తిరుమల సురేష్కు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, 20వేల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2015 మార్చి 4వ తేదీ పిచ్చాటూరు మండలం, రెప్పలపట్టు గ్రామం సమీపంలోని అరణియారు డ్యాం వద్ద పిచ్చాటూరు పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. పోలీసులను చూసి నిందితుడు సురేష్తో పాటు మరి కొంతమంది పోలీసులపై రాళ్లతో దాడిచేసి పరారయ్యారు. అయితే పోలీసులు సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. సురేష్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మరో ఇద్దరిపై కేసును కొట్టివేస్తూ తీర్పులో పేర్కొన్నారు.

ఫిట్‌నెస్ ఐజర్


ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలోని తిరుపతి ఐజర్

'వారంతా శాస్త్ర, సాంకేతిక రంగంలో భావి ఆవిష్కర్తలుగా సేవలందించేందుకు తరగతి గదుల్లో, సైన్స్ ల్యాబుల్లో మెదడుకు పదును పెడుతున్నారు. అందుకోసం వారికి కావాల్సిన శారీరక, మానసిక సామర్థ్యం కల్పించే దిశగా తిరుపతి ఐజర్ యాజమాన్యం చర్యలు చేపట్టింది. కోట్ల రూపాయల నిధులతో ఇండోర్ స్టేడియం.. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించారు. ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలోని తిరుపతి ఐజర్ శాశ్వత క్యాంపస్‌లో ఇప్పటికే ప్రత్యేక స్పోర్ట్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులు, ఆచార్యుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసింది.

- విద్యార్థుల చదువుతోపాటు శారీరక ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న ఐజర్
- ప్రత్యేకంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం
- రూ.16 కోట్లతో అధునాతన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్
- ఖేలో ఇండియా నిధులు రూ.9 కోట్లతో అథ్లెటిక్ ట్రాక్
- ప్రత్యేక చొరవ చూపుతున్న ఐజర్ రిజిస్ట్రార్

ఏర్పేడు: తిరుపతి ఐజర్‌లో చదువుతున్న విద్యార్థులు, విద్యాబోధన చేస్తున్న ఆచార్యులు, పలు విభాగాల సిబ్బంది ఆరోగ్యం కోసం యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది. భవిష్యత్ ఆవిష్కర్తలుగా ఉన్న ఐజర్ ప్రాంగణంలో రూ.16 కోట్లతో అధునాతన హంగులతో కూడిన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. అందులో రెండు బ్యాడ్మింటన్ కోర్టులు, ఒక బాస్కెట్ బాల్ కోర్టు, రెండు స్క్వాష్ కోర్టులు, టేబుల్ టెన్నిస్ గదులు, అధునాతన సాధన పరికరాలతో కూడిన వ్యాయామశాల, చెస్, క్యారమ్స్ వంటి గేమ్స్ ప్రాంగణాలను ఈ స్టేడియంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రూ.6 కోట్లతో క్రికెట్ గ్రౌండ్, స్టేడియం, రెండు టెన్నిస్ కోర్టులు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి.


కొత్తగా ఏర్పాటు చేసిన వ్యాయామశాల

రూ.9 కోట్లతో అథ్లెటిక్ ట్రాక్..

ఖేలో ఇండియా నిధులు రూ.9 కోట్లతో ఐజర్ ప్రాంగణంలో అథ్లెటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఫుట్‌బాల్ గ్రౌండ్, ఫీల్డ్ ఈవెంట్ల నిర్వహణకు గ్రీనరీతో కూడిన గ్రౌండ్‌ను నిర్మించనున్నారు. ఇవన్నీ పూర్తయితే ఐజర్‌లో పూర్తిస్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్ రూపుదిద్దుకోనుంది.



విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం

ఐజర్‌లో చదువుతున్న విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం అందించడం కోసం డైరెక్టర్ ప్రొఫెసర్ సంతాను భట్టాచార్య దూరదృష్టితో ప్రాంగణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. రూ.6 కోట్ల నిధులతో ఐజర్ ప్రాంగణంలో సరికొత్త హంగులతో క్రికెట్ గ్రౌండ్, స్టేడియం, టెన్నిస్ కోర్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. ఖేలో ఇండియా నిధులు రూ.9 కోట్లతో అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నాం. చదువులతో పాటు క్రీడలు, వ్యాయామానికి మేము తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నాం. దీంతో పిల్లల్లో సమస్యా సాధన సామర్థ్యం పెంపొందుతోంది.

– ప్రొఫెసర్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లి, రిజిస్ట్రార్, ఐజర్, తిరుపతి




ఐజర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న వివిధ ఇండోర్ గేమ్స్ మైదానాలు, వ్యాయామ పరికరాలు

ఉరేసుకుని వ్యాపారి మృతి

కోట: కోట బజారువీధిలో టీదుకాణం నడుపుతున్న రాము(45) అనే వ్యక్తి సోమవారం ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. ఇతను గత కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఈ విషయమై తమకు ఎటువంటి సమాచారం లేదని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

పులికాట్ సరస్సులో బాలుడి గల్లంతు

– ముమ్మరంగా గాలిస్తున్న జాలర్లు


బాలుడి ఆచూకీ కోసం సరస్సులో గాలిస్తున్న జాలర్లు

తడ : పులికాట్ సరస్సులో సోమవారం తమిళనాడుకు చెందిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు పడిపోయి గల్లంతయ్యాడు. బాలుడి ఆచూకీ కోసం జాలర్లు ముమ్మరంగా గాలింపు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. ఇరకం దీవికి చెందిన ఎల్లయ్య పిల్లల చదువు నిమిత్తం తమిళనాడులోని ఎన్నూరు కుప్పానికి వెళ్లిపోయాడు. గ్రామంలో శనివారం జరిగిన తిరునాళ్ల నిమిత్తం కుమారుడు రామరాజు (17)తో కలిసి స్వగ్రామానికి వచ్చాడు. తిరునాళ్లు ముగిసిన అనంతరం సోమవారం తిరుగు పయనమయ్యారు. తాత ఆర్ముగం పడవలో హుషారుగా ఆడుకుంటూ బయలుదేరిన రామరాజు కొంతసేపటి తరువాత పడవలో కనిపించలేదు. తండ్రి, తాత ఇది గమనించి చుట్టూ గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామ జాలర్లు తమ పడవల్లో పులికాట్ సరస్సులో గాలింపు చేపట్టారు. పొద్దుపోయి, చీకట్లు కమ్ముతున్నా గల్లంతైన బాలుడి ఆచూకీ లభించలేదు. గ్రామం మొత్తం పులికాట్ సరస్సు వద్దకు చేరుకుని బాలుడి ఆచూకీ కోసం సరస్సు వైపు ఆందోళనగా చూస్తున్నారు.

బీటెక్ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ సెల్ఫ్ ఫైనాన్స్‌తో పాటు వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్న స్వీడన్ వర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సులో స్పాట్ అడ్మిషన్లకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈఏపీసెట్–2025లో అర్హత సాధించిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలియజేశారు. ఆసక్తి అభ్యర్థులు వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగంలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 0877 2248589 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కత్తితో హల్‌చల్

- రౌడీషీటర్‌తో పోలీసుల రోడ్ షో


పోలీసుల అదుపులో యువకులు


నిందితులను రాత్రివేళ నడిపించుకుంటూ కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలోని విక్టరీ వైన్స్ వద్ద ఆదివారం రాత్రి ఓ యువకుడు కత్తితో హల్‌చల్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నగరంలోని టీవీఎస్ సర్కిల్ వద్ద ఉన్న ఓ వైన్ షాప్ ముందు కత్తి బయటకు ప్రదర్శిస్తూ వీరంగం సృష్టించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు.. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తన బృందంతో ఆ యువకుడిని, అతనితో పాటు ఉన్న మరో యువకుడిని వీడియో ఆధారంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కత్తితో హల్‌చల్ చేసిన వ్యక్తి రౌడీషీటర్ ఫిరోజ్, పక్కన ఉన్న వ్యక్తి సయ్యద్ బాషాగా గుర్తించామన్నారు. ప్రధాన నిందితుడు ఫిరోజ్ గతంలో కేసుల్లో నేరస్తుడనీ, అతను చాలా కాలంగా పరారీలో ఉన్నాడని తెలిపారు. వారిద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారించామని..వారిపై ఇప్పటికే పలు కేసులు కూడా ఉన్నాయని.. తెలిపారు.

నగరంలో నడిపించుకుంటూ కోర్టుకు..

రెండు రోజుల క్రితం చిత్తూరులో లైంగిక దాడి కేసులో నిందితులను పోలీసులు కోర్టు వరకు నడిపించుకుని తీసుకెళ్లారు. అదే తరహాలో తిరుపతిలో కత్తితో హల్‌చల్ చేసిన నిందితులు ఫిరోజ్, సయ్యద్ బాషాలను తిరుపతి పోలీసులు సోమవారం రాత్రి ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి నడిపించుకుంటూ కోర్టుకు తీసుకెళ్లారు. న్యాయమూర్తి ముందు హాజరుపరచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం.. ప్రజలకు ఇబ్బంది కలిగించడం లాంటివి చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ సుబ్బారాయుడు హెచ్చరించారు. నగరంలో రౌడీషీటర్ల కదలికలపై మరింత నిఘా పెంచుతామని తెలిపారు.

మాపై ఎందుకీ నిర్దయ..!

- ఎన్నిరోజులని తిరుగుతాం.. దయచూపి సమస్యలు పరిష్కరించండి
- కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో అధికారులకు చేతులు జోడించి వేడుకుంటున్న అర్జీదారులు
- స్ట్రెచర్‌పై వచ్చి పింఛన్ ఇవ్వాలని వేడుకున్న ఓ దివ్యాంగుడు
- మారని అధికారుల తీరు
- కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 276 అర్జీలు


స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్‌కు నమస్కరిస్తూ సమస్యను వివరిస్తున్న అర్జీదారుడు


కలెక్టరేట్‌కు స్ట్రెచర్‌పై వచ్చిన దివ్యాంగుడి నుంచి వినతిపత్రం తీసుకుంటున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: "రెండు చేతులు జోడించి మీకు నమస్కరిస్తున్నాం అయ్యా.. మా సమస్యకు పరిష్కారం చూపండి" అంటూ పలువురు ప్రజలు అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు అధికారుల వద్దకు వెళ్లి తమ గోడు చెప్పుకుని పరిష్కారం చూపాలంటూ కంటతడి పెట్టుకున్నారు. అధికారులను ప్రాధేయపడ్డారు. తమ సమస్యలను సీరియస్‌గా తీసుకుని పరిష్కారం చూపాలంటూ కొందరు పదేపదే విజ్ఞప్తి చేశారు.

అధికారుల తీరేమో ఇలా..

అధికారులు మాత్రం ఎప్పటిలాగానే ఒకేవిధంగా మాట్లాడుతున్నారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలన చేయండి.. సమస్యలకు పరిష్కారం చూపండి.. సమస్య పరిష్కారం కాకుంటే అందుకు గల కారణాలను వివరించండి.. కలెక్టరేట్‌కు పదేపదే తిప్పకండి అంటూ చెప్పేసి చేతులు దులుపుకుంటున్నారు. సోమవారం కలెక్టరేట్‌కు 276 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ సమస్యలే 157 అర్జీలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తోపాటు పలువురు జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

కరుణించండీ సామీ..

ఏడుకొండల స్వామి కరుణించు అంటూ పింఛన్ కోసం ఓ దివ్యాంగుడు కలెక్టరేట్‌కు సోమవారం స్ట్రెచర్‌పై వచ్చాడు. పింఛన్ ఇవ్వాలంటూ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వికలాంగుడి తల్లి రేణుక మాట్లాడుతూ నారాయణవనం మండలం సుబ్బానాయుడు కండ్రిగకు చెందిన తమ కుమారుడు లక్ష్మయ్య(25) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదంలో వెన్నెముక దెబ్బతినడంతో మంచానికే పరిమితం అయ్యాడని వాపోయింది. పేద కుటుంబం కావడంతో బతుకు భారంగా మారిందని..పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ఆమె జేసీ వద్ద కన్నీళ్లు పెట్టుకుంది.

తల్లికి వందనం పథకం ఇప్పించండి



నా పేరు నాగమణి, మాది తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడ. అయితే తల్లికి వందనం పథకానికి అర్హులమైనా మాకు పథకం రాలేదు. మా బిడ్డకు తల్లికి వందనం మూడో దశలో అయినా ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. మేము పేద కుటుంబం. మాకు న్యాయం చేయండి. – నాగమణి, తిరుపతి

దివ్యాంగుల పింఛన్ ఇప్పించండి



నా పేరు కేజీ సుబ్రమణ్యం, మాది నారాయణవనం. దివ్యాంగుల పింఛన్ పొందడానికి నాకు అర్హత ఉంది. బోదకాలు కావడంతో నడవడానికి ఇబ్బంది పడుతున్నా. మాది పేద కుటుంబం. అధికారులు మా పేదరికాన్ని గుర్తించి పింఛన్ ఇప్పించాలి

– కేజీ సుబ్రమణ్యం, నారాయణవనం

సేవాభావంతో రెడ్‌క్రాస్ పని చేయాలి


కొత్త కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవాభావంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సాధారణ సమావేశాన్ని కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కమిటీని దాదాపు వందమంది సభ్యుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని 11 మంది సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. తరువాత చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్‌ను ఎన్నుకున్నారు. వివిధ రంగాలకు చెందిన ఎనిమిది మంది సభ్యులు ఈ కొత్త కమిటీలో ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వారు "కరుణ, నిబద్ధతతో మానవ సేవ" అనే రెడ్ క్రాస్ ధ్యేయాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అధ్యక్షుడిగా డాక్టర్ దగ్గుబాటి శ్రీహరి రావు, ఉపాధ్యక్షుడిగా మయూర్ గుడ్లూరు, కార్యదర్శిగా డాక్టర్ ప్రతీత్, ట్రెజరర్‌గా జీవీ సుబ్బారావు, కృష్ణకుమార్, సభ్యులుగా డాక్టర్ భారతి, గుణశేఖర్, శ్రీనివాసులు రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, శివకుమార్, శ్రీనివాస్, ఎస్ఎస్ రవిని సభ్యులుగా ఎనుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు సమావేశానికి అధ్యక్షత వహించగా, ట్రెజరర్ రామచంద్రరాజు రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడిగా హాజరై ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇద్దాం

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రలో భాగంగా అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలలో మూడవ శనివారం వినూత్న థీమ్‌తో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ నాటికి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నిర్మూలించే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. తిరుపతి జిల్లాకు మొత్తం 18 కేటగిరిలలో 51 అవార్డులు దక్కాయని, ఇందులో రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ మున్సిపాలిటీలలో తిరుపతికి ఒక అవార్డు వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, డీపీఓ సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛాంధ్ర అవార్డులు పొందిన వారు

ఆటోలు బోల్తా పడి..


ఆటోలో ఇరుక్కున వారిని బయటకు తీస్తున్న స్థానికులు

చిల్లకూరు : ఆటోలు బోల్తా పడి పలువురు ప్రయాణికులు గాయపడిన ఘటనలు సోమవారం చిల్లకూరు, కోట మండలాల్లో వెలుగుచూశాయి. ఇందులో సైదాపురం మండలం కృష్ణారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఆటోలో గూడూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో తిప్పవరప్పాడు సమీపంలోకి వచ్చే సరికి ఆటో ముందు టైర్ పగలడంతో డ్రైవర్ ఆటోను అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడింది. అయితే ఆటోలో ఉన్న ఇద్దరు, డ్రైవర్ ఆటోలో ఇరుక్కు పోవడంతో అటుగా వెళ్లే వారు వారిని బయటకు తీసి మరో ఆటోలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఎలాంటి సమాచారం అందలేదని గూడూరురూరల్ పోలీసులు తెలిపారు.

కోటలో..

కోట: మండలంలోని ఉత్తమ నెల్లూరు గ్రామం మలుపు వద్ద సోమవారం ఆటో బోల్తాపడిన ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. గోవిందపల్లి నుంచి కోటకు ప్రయాణికులతో వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది వారిని గూడూరు ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. వారిలో సుప్రియ అనే మహిళకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

- సీఎం చంద్రబాబు ప్రకటించిన రూ.196 కోట్లను వెంటనే రైతులకు అందించాలి
- త్వరలోనే మామిడి సాగు రైతుల హక్కుల కోసం నూతన సంఘం ఏర్పాటు


వినతిపత్రం అందజేస్తున్న మామిడి రైతు నేతలు

చంద్రగిరి: మామిడి దిగుబడిలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు రైతు నేత యారాశి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మామిడి రైతుల సమస్యల పరిష్కారం కోసం యారాశి చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో చంద్రగిరిలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని మామిడి రైతుల సమస్యలను కేంద్రంగా తీసుకుని ఒక ప్రత్యేక చర్చా వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న కష్టాలు, ప్రభుత్వ సహాయాలు రాలేకపోవడం, గుజ్జు పరిశ్రమల సమస్యలు, మామిడి ఉత్పత్తుల సరైన ధరల కోసం వారి హక్కుల పరిరక్షణ వంటి అంశాలు చర్చించడం జరుగుతుందన్నారు.

రూ.196 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేయాలి

ప్రభుత్వం కిలో మామిడికి రూ.4 సబ్సిడీ నగదు జిల్లా వ్యాప్తంగా రూ.196 కోట్ల మేర రైతులకు అందజేయాల్సి ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం చంద్రబాబు సబ్సిడీ నగదును మామిడి రైతులకు అందించడం జరిగిందన్నారని, అయితే ఇప్పటి వరకు నగదు జమ చేయలేదని, వెంటనే రైతులకు అందజేయాలని కోరారు.

సిండికేట్‌తో మరింత నష్టాల్లో రైతులు..

మామిడి కాయల మండీల్లో దళారులు అంతా కలిసి సిండికేట్‌గా మారడం ద్వారా మరింతగా మామిడి రైతులు నష్టపోతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, ఔరంగజేబు, ప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కుసుమ, ప్రతాప్ రెడ్డి, మురగయ్య యాదవ్, కృష్ణారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, గురవారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లను 3వ కేటగిరీకి మార్చండి

తిరుపతి రూరల్: తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లోని మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి రికార్డు చేసే విద్యుత్తు బిల్లులు కేటగిరి 2లో ఉండడం వల్ల చార్జీలు అధికంగా వస్తున్నాయని, కేటగిరి 3 కిందకు మార్చాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వాటర్ ప్లాంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మోహన్ బాబు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు సోమవారం ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావును కలిసి వాటర్ ప్లాంట్ అసోసియేషన్ నేతలు, సభ్యులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఎంతోమంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక కుటుంబ పోషణ కోసం మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నామని విన్నవించారు. అయితే వాటి విద్యుత్ మీటర్లు కేటగిరి 2 కింద ఉండడంతో రెట్టింపు స్థాయిలో బిల్లు వస్తోందన్నారు. ప్లాంట్లను నమ్ముకుని కొన్ని వేల కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘు, తిరుపతి నగర అధ్యక్షుడు ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడు శోభన్ బాబు, సభ్యులు ప్రసాద్, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, ఉపాధ్యక్షుడు హరీష్ రాయల్, జగన్, విజయ్ కుమార్, మురళి ఉన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారముల్లో

WALK IN INTERVIEW
SLs / JLs: Physics / Chemistry / Maths & Languages
FRONT OFFICE STAFF
Receptionist, Telecallers, Accountant
HOSTEL WARDENS
for Both Boys & Girls
MARKETING PROs:
Work from their home towns
(Attractive Salary for experienced)
SAHASRAS VIGNAN Jr. COLLEGE
Bairagipatteda, Tirupati
Cell: 9963616629, 8977002335/6/7/8
sahasrasvignan@gmail.com

సాక్షి క్లాసిఫైడ్స్

Education

HOME TUTIONS
Vasundhara Home Tutions. 8th to Inter (State, NEET, CBSE, IB, JEE) &Piano Coaching. C.Ranjeet Kumar. Ph: 98779 19282, 80082 00797

Wanted
తిరుపతి జిల్లాల్లో పనిచేయుటకు సిబ్బంది కావలెను. మిల్క్ టాంకర్ లోడర్స్ – SSC / Inter, ఫీల్డ్ ఆఫీసర్–Any Degree, జీతం: 15,000, సంప్ర: 7799777689.

కష్టమైన్ది కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు – 40వేలు, ఫ్రీ రూం+భోజనం, Hyd. 7993583999

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.